నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కడ్తాల్, జూన్ 15: నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసగిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఏవో శ్రీలత అన్నారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటామన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో శనివారం ఎరువుల, విత్తనాల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. దుకాణాల రికార్డులు, విత్తన ఎరువుల నిల్వలను,గోదాంలను పరిశీలించారు. విక్రయించిన ఎరువులు, విత్తనాలకు సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వాలని డీలర్లుకు సూచించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వంద, డీలర్లు జితేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు



మొయినాబాద్‌లో ముసుగు గప్పిన ఇంద్రారెడ్డి విగ్రహం

మొయినాబాద్ రూరల్, జూన్ 15: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విధించిన కోడ్ కారణంగా నాయకుల విగ్రహాల ముఖాలు కనిపించకుండా మూసేశారు. ఈ నేపథ్యంలోనే మొయినాబాద్ మండల కేంద్రంలోని దివంగత మాజీ హోం శాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి విగ్రహానికి అధికారులు తెల్లటి ముసుగును ఏర్పాటు చేశారు. అయితే, ఎన్నికల కోడ్ ముగిసినా ఇంద్రారెడ్డి విగ్రహంపై ఏర్పాటు చేసిన ముసుగును తొలగించలేదు. దీంతో ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు అదికారులు, సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. వెంటనే ఇంద్రారెడ్డి విగ్రహానికి ఏర్పాటు చేసిన ముసుగును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

హాస్టల్ గదిలో ఉరేసుకొని

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ!
- ఆర్థిక ఇబ్బందులే కారణం : తండ్రి
- ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఘటన



నరేంద్ర(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జూన్ 15: ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో శుక్రవారం రాత్రి బీటెక్ ఫైనలియర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, ప్రేమ వ్యవహారమే అతడి ఆత్మహత్యకు గల కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామానికి చెందిన సంగెపు రాంబాబు కుమారుడు నరేంద్ర(22) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతూ ఆదిభట్ల ఏరోస్పేస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్క గదిలో ఉన్న విద్యార్థులుచూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనగా.. ఆత్మహత్యకు గల కారణం ప్రేమ వ్యవహారమేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నరేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో సారి భూముల విలువ పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఏ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచాలనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా రాష్ట్రంలో మిగతా చోట్లతో పోలిస్తే హైదరాబాద్ చుట్టు పక్కల విస్తరించి ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు అధికంగానే ఉంటాయి. ఈ మేరకు ఏఏ ప్రాంతాల్లో భూములు ధరలు ఎంతెంత పెంచాలనే దానిపై ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ఆదేశంతో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పని మొదలు పెట్టారు.

- 111జీవో పరిధిలో భారీగా పెరిగే అవకాశం
- ఎక్కువ ఉన్న చోట తగ్గించే విషయం పరిశీలన
- ఇప్పటికే కమిటీలు ఏర్పాటు చేసిన సర్కార్
- జిల్లా స్థాయి కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ నియామకం




భూముల విలువ పెంపునకు కసరత్తు!

శివార్లలో పలు చోట్ల పెరగనున్న భూముల విలువ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూముల విలువలు భారీగా పెరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల విలువ పెంచాలని సర్కార్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితుల ఆధారంగా భూముల మార్కెట్ ధరలను సవరించాలని సర్కార్ ఆదేశించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్‌ను చైర్మన్‌గా నియమించారు. ఇక కింద స్థాయిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వేరుగా కమిటీలను నియమించారు. పట్టణ ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించిన కమిటీలు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీవో ఆధ్వర్యంలో ఉండే కమిటీలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే వీరంతా ఆయా ప్రాంతాల్లో భూముల ధరల పెంపుపై అధికారులు కరసరత్తు మొదలు పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత గత ప్రభుత్వం రెండు సార్లు రిజిస్ట్రేషన్ల భూముల ధరలతో పాటు స్టాంప్ డ్యూటీని కూడా పెంచింది. రాష్ట్రంలో 2021 జూలైలో ఆ తరువాత 2022 ఫిబ్రవరిలో భూముల విలువ పెంచారు. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి భూముల విలువ పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఏ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచాలనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా రాష్ట్రంలో మిగతా చోట్లతో పోలిస్తే హైదరాబాద్ చుట్టు పక్కల విస్తరించి ఉన్న ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో భూముల ధరలు అధికంగానే ఉంటాయి. హైదరాబాద్ మహానగరంలో అంతర్భాగంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో భూములు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. గతంలో రంగారెడ్డిజిల్లాలోని జరిగిన ప్రభుత్వ భూముల వేలంలో ఎకరా గరిష్ఠంగా రూ. 100కోట్లు పలికిన సంగతి తెలిసిందే. అయితే వాస్తవానికి ఆ ప్రాంతంలో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ పట్టుమని రూ.10కోట్లు కూడా లేదు. దీంతో వాస్తవ ధరకు రిజిస్ట్రేషన్ శాఖ నిర్ధారించే ధరకు పదిరెట్ల వరకు తేడా ఉంటుంది.



ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా భూముల విలువ పెంచాలని నిర్ణయించింది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చివరి సారిగా 2013లో భూములు ధరలు పెంచారు. తరువాత 2021, 2022లో వరుసగా భూముల విలువ సవరించారు. అయితే అనేక చోట్ల వాస్తవ ధరలకు. ప్రభుత్వ నిర్ధారిత ధరకు పొంతన లేకుండా ఉంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండిపడుతోంది. ఇది గుర్తించిన ప్రభుత్వం భూములు విలువ పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు అయితే ఏఏ ప్రాంతాల్లో భూములు ధరలు ఎంతెంత పెంచాలనేదానిపై స్థానికంగానే కసరత్తు చేసి ఈ మేర ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం ఆదేశంతో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పని మొదలు పెట్టారు. కొన్ని చోట్ల పక్కపక్క భూముల మధ్య మార్కెట్ విలువలో భారీగా వ్యత్యాసాలు ఉన్నందున వీటిని గుర్తించి సవరించాలని ప్రభుత్వం ఆదేశించింది. తక్కువ ఉన్న చోట ధరల పెంపుతో పాటు ఎక్కువ ఉన్న చోట తగ్గించాలని కూడా సూచించింది. ఈ మేరకు అధికారులు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

మారుమూల ప్రాంతాల్లో 30శాతం

అలాగే కొత్తగా నిర్మించనున్న రీజినల్ రింగురోడ్డు నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో కూడా భూముల విలువ భారీగా పెంచనున్నారు. రోడ్డు,. రవాణా మౌలిక సదుపాయాలు ఉన్న చోట్ల భారీగా .భూముల విలువ పెంచాలని నిర్ణయించారు. ఔటర్ రింగురోడ్డు, మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్త రోడ్లు వేసే ప్రాంతాల్లో ధరలు భారీగా పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా 30శాతం వరకు .భూములు విలువ పెంచవచ్చని తెలుస్తోంది.

పలు చోట్ల భారీగా పెరిగే అవకాశం

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ భూములన్ని ఎక్కువగా వ్యవసాయేతర భూములుగా మారాయి. గతంలో ఎకరాలు అమ్మిన ప్రాంతాలు కాస్తా ఇప్పుడు వెంచర్లుగా చేసి గజాలుగా అమ్మేస్తున్నారు. చాల వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగాను, అపార్టుమెంట్, విల్లాలుగా మారాయి. నగర శివార్లలో 111జీవో ఎత్తివేయడంతో ఈ పరిధిలోని దాదాపు లక్షన్నర ఎకరాల భూముల్లో ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ జీవో పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఏకంగా నాలుగైదు రెట్ల ధరలు పెరిగాయి. జీవో పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఎకరా భూమి రిజిస్ట్రేషన్ విలువ రూ. 25లక్షలు లోపుగానే ఉంది. అయితే ఇప్పుడు ఈ ప్రాంతాల్లో ఎకరా మార్కెట్ ధర దీనికి రూ. 20రెట్ల వరకు అధికంగా ఉంది. ఇప్పుడు ఇలాంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ధరలు సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బిల్లుల కోసం రోడ్డెక్కిన పాడి రైతులు

- కడ్తాలలో పెద్దఎత్తున ఆందోళన
- హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో
- రోడ్డుపై పాలు పారబోసి నిరసన



రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కడ్తాల్, జూన్ 15: పాల బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ విజయ పాడి రైతులు రోడ్డెక్కారు. నాలుగు పక్షాల బిల్లులు రాకపోవడంపై ఆగ్రహించారు. పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించాలని శనివారం కడ్తాల పాలశీతలీ కరణ కేంద్రం ఎదుట హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కడ్తాల పాలశీతలీ కరణ కేంద్రం పరిధిలోని పాలసేకరణ కేంద్రాల అధ్యక్షులు, పాడి రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. పెండింగ్ నాలుగు బిల్లులను వెంటనే చెల్లించాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పాడి పరిశ్రమ ఆధారంగా జీవనం సాగిస్తున్న తమకు నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పాలు పారబోసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని రైతులు భీష్మించారు. అనంతరం కడ్తాల పాలశీతలీ కరణ కేంద్రం మేనేజర్ రాధికకు వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని పాలసేకరణ కేంద్రం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు కదారి రామకృష్ణ అన్నారు. సకాలంలో బిల్లులు రాని కారణంగా పాడి రైతులు దాణా కొనుగోలు, ఆవుల నిర్వాహణకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. వానాకాలం పంటల సాగు, పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో పిల్లల ఫీజుల చెల్లింపునకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్ పాల బిల్లులు వెంటనే విడుదల చేసి రైతుల ఇబ్బందులు తీర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు, పాడి రైతులు సుధాకర్, కృష్ణయ్య, వెంకటేశ్, జంగయ్య, మహేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు, రామచంద్రి, ప్రశాంత్, అనిల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రజల తీర్పు అనూహ్యం

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి జూన్15: చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు అనూహ్యమైన తీర్పు ఇచ్చారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు శనివారం శంకర్‌పల్లిలో రామంతాపూర్ ప్రసన్నాంజనేయ దేవాలయం వద్ద నుంచి మణిగార్డెన్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మణిగార్డెన్‌లో నాయకులు ఆయనకు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ లింగంపల్లి వరకు ఉన్న ఎంఎంటీఎస్ రైలును శంకర్‌పల్లి మీదుగా వికారాబాదు వరకు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ దిశగా సహకరించాలన్నారు. చెవెళ్ల నియోజవర్గంలో బీజేపీ ఎంతో బలంగా ఉందని, అన్ని వర్గాల వారు తనకు ఓటు వేసి గెలిపించడం సంతోషకరమన్నారు. శంకర్‌పల్లి మండలం తనకు పదివేల మెజారిటీ ఇచ్చిందని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వివరించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గోవర్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ, మండల అధ్యక్షుడు రాములు గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేష్, మున్సిపల్ ఇన్‌చార్జి వాసుదేవ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, బయన్న, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో అవకతవకలపై విచారణ జరిపించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి
- డీఈడీ, బీఈడీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని ధర్నా
- అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పణ



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

రంగారెడ్డి అర్బన్, జూన్ 15 : ఉపాధ్యాయ బదిలీల్లో స్థానిక, స్థానికేతర అంశంలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డీఈడీ, బీఈడీ చేసిన నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయంపై శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, మంచిర్యాల, యాదాద్రి, సంగారెడ్డి వంటి అనేక జిల్లాల నుంచి స్థానికేతర ఉపాధ్యాయులు జిల్లాకు వచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఆర్డర్లతో, స్పౌజ్, విరుద్ధ పోస్టుల పేరుతో స్థానిక నిరుద్యోగులకు చెందాల్సిన ఖాళీలను స్థానికేతరులతో నింపారని, ఇక పరస్పర బదిలీలు చేసినప్పుడు కూడా నింబంధనలను పాటించక పోవడతో జిలాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. 400కు పైగా ఉపాధ్యాయ ఖాళీలను నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతరులతో భర్తీ చేశారని ఆరోపించారు. కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థం, అధికారుల అవినీతి కారణంగా 2021 నుంచి 2023 వరకు జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాలన్నీ అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక, స్థానికేతర అంశాన్ని వెంటనే తేల్చకుంటే జిల్లా వ్యాప్తంగా పార్టీ తరఫున ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు.

నీటి సరఫరాపై ఇంటింటి సర్వే



చేవెళ్లలో ఇంటింటి సర్వే చేస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది

చేవెళ్ల, జూన్ 15 : మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం చేవెళ్లలోని కాలనీల్లో కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది సర్వే చేశారు. నల్లా నీరు సక్రమంగా వస్తోందా? కుటుంబ సభ్యులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కనెక్షన్‌ను పరిశీలించి ఇంటి యాజమని ఆధార్ కార్డు నంబర్‌ను, ఫొటోను ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు కార్యదర్శులు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'ధరణి' రికార్డుల పరిశీలన



యాచారం, జూన్ 15: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారానికి పది రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. శనివారం ధరణి రికార్డులను తన చాంబర్‌లో సరిచేయడంలో నిమగ్నమయ్యారు. మండలంలో 2,550 ధరణి సమస్యలున్నట్టు చెప్పారు. రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. వచ్చే మంగళవారం సిబ్బంది కలెక్టరేట్‌లో ఉండి ధరణి సమస్యలపై అధ్యయనం చేస్తారన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్
- డీఎంహెచ్‌వో కార్యాలయం, చెన్‌గోముల్ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన



చెన్‌గోముల్ ఆసుపత్రిలో మెడిసిన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్

పూడూరు/వికారాబాద్, జూన్ 15 : వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ తెలిపారు. శనివారం పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో మెడిసిన్‌లను, రిజిష్టర్లు, రోగుల సంఖ్యను రోజువారీగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వానాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులతో దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయం సందర్శన

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ వికారాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా కార్యాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో పాల్వాన్‌కుమార్, ఐదుగురు ప్రోగ్రామ్ ఆఫీసర్లతో రివ్యూ నిర్వహించారు. వారి పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విధుల గురించి తెలుసుకున్నారు. సుమారు గంట పాటు అధికారులతో మాట్లాడిన హెల్త్ డైరెక్టర్ అంతకు ముందు పూడూరు మండలం చన్‌గోముల్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్, నైపుణ్యంతోనే ఉద్యోగాలు

● కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్



ప్లేస్‌మెంట్స్ పొందిన విద్యార్థులతో జితేందర్‌సింగ్ తదితరులు

ఇబ్రహీంపట్నం, జూన్ 15: విద్యార్థికి స్కిల్ డెవలప్‌మెంట్, నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు సాధించడం సులవవుతుందని కాగ్నిజెంట్ హెచ్ఆర్ మేనేజర్ ఆర్.జితేందర్‌సింగ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ శ్రీదత్త విద్యాసంస్థల్లో ప్లేస్‌మెంట్స్ అచీవర్స్ డే, ఇంజనీరింగ్ ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఏ కోర్సులోనైనా మొదటి సంవత్సరం నుంచే ప్రణాళిక రూపొందించుకుని సాంకేతిక నైపుణ్యాలకు తగ్గట్టుగా ముందుకుపోవాలన్నారు. శ్రీ దత్త విద్యా సంస్థల చైర్మన్ జి.పాండురంగారెడ్డి మాట్లాడుతూ ప్రొటో టైప్ మోడల్స్, మైక్రో మినీమేజర్ ప్రాజెక్టులు సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనాపత్రాలు తయారు చేయడంలో తమ విద్యార్థులకు తగిన విధంగా శిక్షణ ఇవ్వడంతోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు పొదగలుగుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వర్చుసా క్యాంపస్ (ఇండియా) మేనేజర్ డి.అభిషేక్, శ్రీదత్త విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా.జీ.వీ.ఎన్. విభవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.ఎస్.వెంకటేశ్వర్లు, డా.ఎం.సింథెల్‌కుమార్, డా.చంద్రశేఖర్, డీన్‌లు డా.అచ్యుతరావు, డా.రమేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.అశోక్‌కుమార్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి పాటు పడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జూన్ 15: ఉన్నత చదువులు చదివిన వారు దేశ పురోగతికి పాటు పడాలని మల్లారెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో 13వ గ్రాడుయేషన్ డేను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లారెడ్డి విద్యార్థులకు పట్టాలు అందజేసి ప్రసంగించారు. ప్రపంచంలోని అతిపెద్ద వ్యాపారసంస్థల్లో ఉన్నత స్థాయిలో పనిచేసే వారిలో భారతీయులు అధికంగా ఉండటం అభినందనీయమన్నారు. విద్యారంగంలో చోటుచేసుకున్న విప్లవాత్మకమైన మార్పుల కారణంగా నేడు చాలామంది ఉన్నత చదువులు చదివి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించేస్థాయికి చేరుకున్నారన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో విద్యనభ్యసించే విద్యార్థులు దేశ, అభివృద్ధితో పాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ శాలినీరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మాదవీలత, ఎంఆర్‌జీఐ ఎండీ చామకూర మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

10,222 లీటర్ల మద్యం బాటిళ్లు ధ్వంసం

- గోవా సహా పలు రాష్ట్రాల నుంచి ప్రయాణికులు సుంకం చెల్లించకుండా తీసుకొచ్చిన రూ.1.83 కోట్ల మందు
- మే 2023 నుంచి డిసెంబర్ వరకు పట్టుబడిన మద్యం

రాజేంద్రనగర్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : గోవా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌ల నుంచి సుంకం చెల్లించకుండా ప్రయాణికులు తీసుకువస్తున్న 10,222 లీటర్ల మద్యం బాటిళ్లను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు శనివారం రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కాగా, బాటిళ్ల విలువ రూ. 1,83,42,763గా ఉంటుందని అధికారులు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలో గల శంషాబాద్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2023 మే నుంచి గత డిసెంబర్ వరకు నమోదైన 686 కేసులలో సుంకం చెల్లించకుండా వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్న మద్యాన్ని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన కేసులు కోర్టులో నడుస్తున్నాయి. సుంకం చెల్లించకుండా ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని తీసుకురావడం నేరమని గుర్తు చేశారు. దాని వల్ల తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి నష్టం కలుగుతుందన్నారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్న మద్యం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురైనా ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు, ముఖ్యంగా గోవా నుంచి సుంకం చెల్లించకుండా మద్యాన్ని తీసుకువచ్చినట్లయితే వారిపై చర్యలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విదేశీ మద్యం అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని గుర్తుచేశారు. అన్ని విషయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలేకరుల సమావేశంలో శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గంద్ర దేవేందర్‌రావులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయిస్తున్న అధికారులు(ఇన్‌సెట్లో)

డయాలసిస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- భయాందోళనతో పరుగులు తీసిన వైద్యసిబ్బంది, రోగులు
- చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో ఘటన.. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం
- మంటలను ఆర్పివేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం.. ఊపిరి పీల్చుకున్న వైద్యసిబ్బంది



ఆసుపత్రి ఆవరణలో రోగులు, వైద్య సిబ్బంది తదితరులు



డయాలసిస్ గదిలో మంటలు చెలరేగి కాలిపోతున్న సామగ్రి

చేవెళ్ల, జూన్ 15 : చేవెళ్ల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో శనివారం రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దాంతో డయాలసిస్ సెంటర్‌లో ఒక్కసారిగా పొగతో కూడిన మంటలు చెలరేగాయి. గదిలో నుంచి పొగతోపాటు మంటలు బయటకు చిమ్మటంతో వైద్యసిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే ఆసుపత్రిలో ఉన్న రోగులను హుటాహుటిన బయటకు పంపించారు. వైద్యసిబ్బంది సైతం బయటకు పరుగులు తీశారు. అయితే, ఆ సమయంలో డయాలసిస్ సెంటర్ గదికి తాళం వేసి ఉంది. మంటలు, పొగ వెంటిలేటర్, కిటికీల ద్వారా బయటకు వ్యాపించాయి. పోలీస్‌లకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే డయాలసిస్ గదిలో ఉన్న ఫైళ్లు, వైద్యపరికరాలు కాలిపోయాయి. విద్యుత్ సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని కరెంటు సరఫరా నిలిపివేశారు. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలు, వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వద్ద పరిస్థితిని సమీక్షించారు. కాగా, ప్రమాద సమయంలో ఆసుపత్రిలో కాన్పుకోసం వచ్చిన గర్భిణీలు, బాలింతలు, కొందరు ఇతర రోగులు ఉన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు బయటనే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. పాడైన విద్యుత్ వైర్‌తో పాటు వైరు కూడా సక్రమంగా లేకపోవడమే షార్ట్‌సర్క్యూట్‌కు కారణమై ఉంటుందని పోలీస్‌లు, విద్యుత్ సిబ్బంది భావిస్తున్నారు. ఈ సంఘటన రాత్రి 8గంటల జరిగిందని, అర్ధరాత్రి జరిగి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. డయాలసిస్ సెంటర్‌లో రాత్రివేళల్లో పరీక్షల నిర్వహణ జరగదని, పగటి పూట ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని వైద్యులు, సిబ్బంది పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అటవీ భూముల కబ్జాకు పాల్పడవద్దు

- హద్దులు దాటితే కఠిన చర్యలు
- తాండూరు డివిజన్ ఫారెస్ట్ రేంజర్ శ్యామ్ సుందర్‌రావు



బషీరాబాద్, జూన్ 15: తెలంగాణ-కర్ణాటక అటవీ భూముల్లో హద్దులను దాటొద్దని, ఎవరైనా భూకబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు డివిజన్ ఫారెస్ట్ రేంజర్ శ్యామ్ సుందర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన తాండూరులో విలేకరులతో మట్లాడుతూ మండలంలోని నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వు ఫారెస్టులో కొన్నేళ్లుగా రెండు రాష్ట్రాల సరిహద్దులు తేలకపోవడమనేది పెద్ద సమస్యగా మారిందన్నారు. సరిహద్దు ప్రాంత గ్రామాల కన్నడిగులు మన రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలోకి చొచ్చుకొచ్చి అక్రమంగా భూములను కబ్జా చేస్తున్నారని అన్నారు. ప్రతి యేటా హద్దులు దాటి కన్నడిగులు భూ కబ్జాలకు యత్నించడంతో అడ్డుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ అటవీ భూముల్లోకి కన్నడిగులు వచ్చి కబ్జాలకు ప్రయత్నించడంతో ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల రైతుల మధ్య పరస్పరం గొడవలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ భూముల్లోకి ఇకపై ఎవరైనా వచ్చి కబ్జాలకు పాల్పడేందుకు యత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శుక్రవారం ఇరు రాష్ట్రాల రెవెన్యూ, ఫారెస్టు అధికారులందరం కలిసి సర్వేయర్లతో అటవీ భూముల్లో కలియతిరిగి ప్రాథమికంగా ఇరు రాష్ట్రాల హద్దులను నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. సరిహద్దు అంశం ఓ కొలిక్కి వచ్చినందున.. త్వరలో ఇరు రాష్ట్రాల కలెక్టర్లకు సర్వేల నివేదికను అందజేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కిషన్

కీసర రూరల్, జూన్ 15 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి, నైపుణ్యాన్ని వెలికితీయాలని కేంద్ర కుటుంబ, ఆరోగ్య శాఖ డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా మండలి సభ్యుడు డాక్టర్. ఎ.రామ్‌కిషన్ పిలుపునిచ్చారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో కొనసాగుతున్న కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల 15 వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆయన శనివారం విచ్చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో శ్రమించిన వారిని మాత్రమే విజయం వరిస్తుందన్నారు. భారతదేశంలో భవిష్యత్తు అంతా యువతదేనని, నేడు దేశం అన్నిరంగాల్లో దూసుకుపోతోందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. ప్రజా అవసరాలను పసిగట్టి.. అందుకు అనుగుణంగా ఉత్పత్తులను సాధించాలని సూచించారు. కళాశాల చైర్మన్ గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా, ఆర్థికంగా వెనుకబడిన వారికి నాణ్యమైన విద్యనిందించేందుకు కళాశాలను స్థాపించినట్లు వివరించారు. అనంతరం కళాశాల విజయవంతంగా కొనసాగేందుకు సహకరిస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పీవీ రమణారావు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి, ఇతర విభాగాల అధిపతులు ప్రొఫెసర్లు కె.సునీత, రంగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కేఎస్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.వేణు, డాక్టర్ ఎం.శ్రీనివాస్, బాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్షల్లో కరెంటు బిల్లు.. రైతు అవాక్కు

- ఒక నెలకు రూ.7,37,440 వచ్చిన వైనం
- సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన బాధితుడు
- అప్రమత్తమైన విద్యుత్ అధికారులు.. డేటా తొలగింపు



Bill Details HIDE

Customer Name : YENKEPALLY GOPAL

Bill Number : A340001073

Bill Date : 12-Jun-2024

₹ 7,37,440

Due Date: 26-Jun-2024

రైతు ఎన్కెపల్లి గోపాల్‌కు వచ్చిన కరెంట్ బిల్లు

వికారాబాద్, జూన్ 15: వామ్మో.. ఒక రైతుకు రూ.లక్షల్లో కరెంట్ బిల్లు వచ్చింది. అది చూసిన రైతు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. అది ఎక్కడో కాదు.. వికారాబాద్ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం.. వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామంలో. మొన్నటికి మొన్న జిల్లా కేంద్రంలో సామాన్య ప్రజలకు గతంతో పోలిస్తే రెండు రెట్ల కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చింది. తాజాగా సిద్దులూరులో ఎన్కెపల్లి గోపాల్‌కు అక్షరాల రూ. 7,37,440 కరెంట్ బిల్లు వచ్చింది. గమనించిన రైతు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అప్రమత్తమైన విద్యుత్ అధికారులు కంప్యూటర్‌లో డేటా నుంచి బిల్లును తొలగించారు. అయితే, పట్టణంలో ప్రతీనెల 29 రోజులకు బిల్లువేసిన అధికారులు.. ఈనెల 37 రోజులకు, 39 రోజులకు బిల్లు కొట్టడంతో రూ.700 వచ్చే కరెంట్ బిల్లు రూ.1500 రావడం, రూ.1500 రావాల్సిన బిల్లు రూ.3వేలు రావడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఓ వైపు కరెంట్ కోతలు విధిస్తూనే మరోవైపు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో వేలల్లో కరెంట్ బిల్లు వస్తుందని వినియోగదారులు మండిపడుతున్నారు.

పిల్లలు వదిలేశారు.. వృద్ధాశ్రమంలో చేర్పించండి

- ఓ వృద్ధురాలి ఆవేదన



కరన్‌కోట్ బస్టాండ్‌లో వృద్ధురాలు వెంకటమ్మ

తాండూరు రూరల్, జూన్ 15: ఆ తల్లికి నలుగురు సంతానం. నలుగురిని ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేసింది. తీరా పెద్దయ్యాక ఆ నలుగురు పిల్లలు ఎవరి దారి వారు చూసుకుని కన్నతల్లిని వదిలేశారు. వృద్ధాప్యంలో ఆతల్లి దిక్కుతోచని స్థితిలో బస్టాండ్‌లో తలదాచుకుంటోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కరన్‌కోట్‌కు చెందిన చిట్లపల్లి వెంకటమ్మగౌడ్(70 సంవత్సరాలు) భర్త మృతిచెందాడు. వెంకటమ్మకు ఇద్దరు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే ఒక కొడుకు హైదరాబాద్‌లో, మరో కొడుకు బషీరాబాద్‌లో ఉంటున్నారు. కుమార్తెల వివాహం జరిగింది. ఆ తల్లికి ఆస్తుపాస్తులు కూడా లేకపోవడంతో తనపిల్లలు ఎవరూ ఆ తల్లి బాగోగులు చూసుకోవడంలేదు. దీంతో ఆ వృద్ధతల్లి దిక్కుతోచని స్థితిలో కరన్‌కోట్ బస్టాండ్‌లో తలదాచుకుంటోంది. వర్షానికి తడుస్తూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. తనను ఎవరైనా వృద్ధాశ్రమంలో చేర్పించాలని వెంకటమ్మ వేడుకుంది.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

కీసర రూరల్, జూన్ 15 : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కీసర పోలిస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. శనివారం కీసర పోలీస్ పరిధిలోని అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్, నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో ఉజ్వల భవిష్యత్ కోల్పోవటంతో పాటు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల తయారీలో భాగస్వాములైనా, కలిగియున్నా, వినియోగించినా చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలను సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. డ్రగ్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సైలు మధు, హరిప్రసాద్, పాఠశాలల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

బొంరాస్‌పేట్, జూన్ 15: తుంకిమెట్ల నుంచి బొంరాస్‌పేట్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో గత రాత్రి కురిసిన వర్షానికి భారీ గుంతలు ఏర్పడ్డాయి. బొంరాస్‌పేట్ పెద్ద చెరువు అలుగు పారే దగ్గర రోడ్డు మధ్యలో రెండు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గ్రామ పంచాయతీలకు ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించేందుకు ఇటీవల రోడ్డు పక్కనే గుంతలు తీశారు. వాహనదారులు ఆదమరిస్తే వాటిలో పడి ప్రమాదబారిన పడే అవకాశముంది. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బొంరాస్‌పేట్ అలుగు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత →



న్యాయవాది వృత్తిలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 15: జిల్లా పరిధిలో లా కోర్సు చదివిన బీసీ విద్యార్థులు న్యాయవాది వృత్తిలో 3 సంవత్సరాలు ఉచిత శిక్షణ పొందుటకు 2024-25 విద్యా సంవత్సరానకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరుగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. అర్హులైన బీసీ యువతీయువకులు వెనుబడిన తరగతులకు చెందిన అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి గుర్తింపు పొందిన కళాశాల నుంచి లా పాసై ఉండాలన్నారు. వయోపరిమితి జూలై 2024 నాటికి 23 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారైతే.. రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షలు ఉండాలన్నారు. అభ్యర్థులు గతంతో ఇదివరకు ఉచిత శిక్షణ పొంది ఉండదరాదన్నారు. డిక్లరేషన్ జత చేయాలని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలని సూచించారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను ఆసక్తి గల అభ్యర్థులు కలెక్టరేట్ కార్యాలయంలోని బీసీ వెనుకబడిన తరగతుల శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

పీఈటీలు, పీడీల సమస్యలు పరిష్కరించండి

యాచారం, జూన్ 15 : వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు బాబయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ సాబేర్‌లు రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనను జిల్లాకు చెందిన పీఈటీలు, పీడీలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు వారు శనివారం నగరంలోని స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదోన్నతులు, బదిలీలు తక్షణమే చేపట్టాలని కోరారు. అప్‌గ్రేడేషన్‌కు అడ్డంకిగా ఉన్న నిబంధనలు సవరించి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. బదిలీలు, పదోన్నతులలో అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేవసేను కలిసినవారిలో జిల్లా పీఈటీలు పీడీల సంఘం నాయకులు దేవదాస్, యాదమ్మ, సుధ, అజయ్‌రాథోడ్, భాస్కర్, బాల్లయ్య, కవిత, నిర్మల తదితరులున్నారు.



దేవసేనకు వినతిపత్రం అందజేస్తున్న పీఈటీలు, పీడీలు

గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకోండి



యాచారంలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్యబాషా

- యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, జూన్ 15 : మండలంలోని వివిధ గ్రామాల్లో మహలక్ష్మి, గృహలక్ష్మి పథకాలు వర్తించనివారు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డిలు మండల ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహలక్ష్మి, మహలక్ష్మి పథకాలు వర్తించని వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే కార్యాలయ సిబ్బంది పరిశీలన చేసి పేదలకు పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటారని వారు చెప్పారు. ప్రతీ దరఖాస్తును తాము క్షుణ్ణంగా పరిశీలన చేసి పేదలందరికీ పథకాలు వర్తించే విధంగా తాము కార్యాచరణ రూపొందించామని ఎంపీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, వాటిని పరిశీలన చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నాలుగు నెలలుగా డిప్యుటేషన్‌పై డీటీ..

ఎంఆర్‌ఎఫ్‌డీసీకి తహసీల్దార్

- ధరణి స్పెషల్ డ్రైవ్ ముగిసేదాకా తహసీల్దార్ వెళ్లొద్దని కలెక్టర్ ఆదేశం
- ఇద్దరూ డిప్యుటేషన్‌పై వెళితే.. సమస్యలు పరిష్కారమయ్యేదెలా?
- రైతు గోడు పట్టని అధికార యంత్రాంగం.. పేరుకుపోనున్న సమస్యలు

యాచారం, జూన్ 15 : తమ గోడును రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. భూ రికార్డులు ధరణి పోర్టల్‌లో తప్పుగా ఉన్నా.. అధికారులు సరి చేయకపోవడం దారుణమని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు నెలలుగా మండల డిప్యూటీ తహసీల్దార్ కార్తిక్‌సాగర్ కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో రైతుల సమస్యలతో పాటు విద్యార్థులకు అవసరమైన కులం, ఆదాయం వంటి ధ్రువపత్రాలు సకాలంలో అందక నానా ఇబ్బందుల పాలవుతున్నారు. ఇదిలా ఉంటే, తహసీల్దార్ అయ్యప్పను నగరంలోని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్(ఎంఆర్ఎఫ్‌డీసీ)లో విధులు నిర్వహించడానికి డిప్యుటేషన్‌పై పంపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో నగరంలోని ఎంఆర్‌ఎఫ్‌డీసీ కార్యాలయంలో జాయిన్ అయ్యేందుకు తహసీల్దార్ సిద్ధమయ్యారు. అయితే, ధరణి భూసమస్యలపై పది రోజుల స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. దాంతో స్పెషల్‌డ్రైవ్ ముగిసేదాకా ఇక్కడే విధులు నిర్వహించాలని కలెక్టర్ శనివారం తహసీల్దారును ఆదేశించడంతో ఇక్కడే సిబ్బందితో ధరణి సమస్యల రికార్డులను సరిచేయడంలో నిమగ్నమయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులకు సంబంధించి 2,550 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అయితే, పది రోజుల తరువాత కొత్తగా తహసీల్దార్ వస్తారా? లేదా? అనేది సందేహాత్మకంగా మారింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఇద్దరినీ డిప్యుటేషన్‌పై పంపడం సరికాదని పలువురు రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



నాలుగు నెలలుగా డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న ఆయన చాంబర్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



పాఠశాల ఆవరణలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

మాడ్గుల, జూన్, 15: ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేద విద్యార్థులేనని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ వారికి నాణ్యమైన విద్యను బోధించాలని ఎంపీపీ గౌరవరం పద్మ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మాడ్గుల జడ్పీ పాఠశాల విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులు ఎంపీపీ, ఎంపీడీవో పద్మావతిలను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల తల్లి దండ్రులు ఎంతో కష్టపడు తూ చదివిస్తున్నారని, బాగా చదివి వారి ఆశలను నెరవేర్చాలని ఎంపీపీ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, స్కూల్‌డ్రెస్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సర్దార్‌నాయక్, నోడల్ అధికారి పర్వతాలు, హెచ్‌ఎం సుదర్శన్, టీచర్లు దేవయ్య, జ్యోత్స్న, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఉచిత పాఠ్య పుసకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయమ్మ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

యాచారం: ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చదివించాలని మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర అరవింద్‌నాయక్ కోరారు. పాఠశాల విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తీర్చడం కోసం దాతలు ముందుకు రావాలన్నారు. పాఠశాలలో తగిన వసతులు కల్పించేందుకు తన వంతు సాయం చేస్తానన్నారు. దాతలు విద్యార్థులకు నోట్ పుస్తకాలందించి ఆదుకోవాలన్నారు.

ఆదిభట్ల: ఒత్తిడి లేని నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలే సరైనవని ఆదిభట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరమేష్ అన్నారు. బడిబాటలో భాగంగా పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం అనంతరం, బాల సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పరమేష్ మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌తో పాటు పాఠ్య పుస్తకాలు, బుక్కులు, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం సర్కారు బడులే మొదటి ఎంపిక కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బబ్లీ, అంగన్వాడీ టీచర్లు బేబి, సుజాత, ఆశా వర్కర్లు, విద్యార్థుల తల్లాదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ రూరల్: పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం జయమ్మ



యాచారం: మంతన్‌గౌరెల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్



ఆదిభట్ల: విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న హెచ్‌ఎం పరమేశ్

విద్య, ఉపాధికి తోడ్పాటునందిస్తా



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానిక నాయకులు

ఆమనగల్లు, జూన్ 15 : విద్య, ఉపాధి కల్పనకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తానని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం అన్నారు. ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆమనగల్లులోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోతెపల్లిలో నిర్మాణంలో ఉన్న హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానన్నారు. పోచమ్మ తండా హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డిని సత్కరించారు. నాయకులు వెంకటమ్మ, కాడూరామ్, మంగ్లీ, టాక్యానాయక్, అజిత్, లక్ష్మణ్, తానేశ్, కిరణ్, రమేశ్, రవి, రాము ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

ఆమనగల్లు, జూన్ 15 : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సంఘ సేవకుడు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము అన్నారు. విద్యతోనే ప్రగతి, సమాజంలో మార్పు సాధ్యం అని పేర్కొన్నారు. మాడ్గులకు చెందిన ఎండీ సమీర పదో తరగతిలో 9.7జీపీఏ సాధించింది. ఉన్నత చదువు ఫీజుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రాము శనివారం సమీరకు రూ.5వేల సాయం అందజేశారు. విద్యార్థినిని సత్కరించారు. పేద విద్యార్థులకు ప్రతీ ఒక్కరు చేయూత నివ్వాలని కోరారు. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్, అరవింద్, భాస్కర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

మహేశ్వరం, జూన్ 15 : మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్య అనుచరుడు హర్షగూడ మాజీఉపసర్పంచ్ రవినాయక్, మరో 3వందల మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి హర్షగూడలో జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనితారెడ్డి, కృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, ప్రజాపాలనలో కార్యకర్తలే గ్రామాలు, మున్సిపాలిటీల్లో కీలకంగా వ్యవహరించనున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.సునీతఅంద్యానాయక్, ఎంపీటీసీ విజయ్, పాండునాయక్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారెడ్డి, అనితారెడ్డి

అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల, జూన్ 15 : నిబంధనలు ఉల్లంఘిస్తున్న చేవెళ్లలోని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం చేవెళ్లలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాలలో బుక్స్ అమ్ముతుండగా అడ్డుకున్నారు. కొద్దిసేపు పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. బుక్స్ అమ్ముతున్నారని యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే.. 'మీరు ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి.' అని యాజమాన్యం అంటోందని తెలిపారు. ఈ విషయమై ఎంఈవో అక్బర్‌కు ఫిర్యాదు చేసినా రాలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఎంఈవో వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలమ్మడం, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, గణేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నులిపురుగు మాత్రలు వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అమృతాజోసఫ్

కొందుర్గు, జూన్, 15: విద్యార్థులందరికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ అమృతాజోసఫ్ కోరారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా కార్యకర్తలకు, మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లేడ్-చౌదరిగూడ, కొందుర్గు మండలాల హెచ్‌ఎంలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఏడాది వయసు నుంచి 19సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. సమావేశాల్లో ఎంపీడీవో డాక్టర్ అంజనేయులు, ఎంఈవో కిష్టారెడ్డి, ప్రభులింగం పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఈ నెల 20 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇబ్రహీంపట్నం డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా.వినోద్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశాలతో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలతోపాటు బడి మానేసిన పిల్లలందరికీ ఈ మాత్రలు అందేలా చూడాలంటూ సలహాలిచ్చారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

యాచారం, జూన్ 15 : వర్షాలు కురియగానే ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటిని కాపాడాలని యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన యాచారం, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా గ్రామాల్లో హరితహారం నర్సరీలను తనిఖీ చేశారు. ప్రతి గ్రామంలో కనీసం 20వేల మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. ఎండిన మొక్కలస్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో యువత పాలు పంచుకోవాలన్నారు. పాఠశాలలు. పొలం గట్లపై, రోడ్ల వెంట మొక్కలు నాటాలన్నారు. విద్యుత్ వైర్ల కింద నాటొద్దని కోరారు.

కౌలుకు ఆలయ భూముల వేలం

కొందుర్గు, జూన్, 15: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ భూములను కౌలుకు శనివారం రెండోసారి వేలం వేశారు. ఆలయ ఆవరణలో గంగన్నగూడెంలో మిగిలిన భూములకు వేలం వేశారు. 4ఎకరాల 29గుంటలకు టి.శ్రీనివాస్‌రెడ్డి 50వేలకు వేలం పాడారు. 8ఎకరాలకు టి.సుధాకర్‌రెడ్డి 90వేలకు, 8ఎకరాల 8గుంటలకు టి.నవాజ్‌రెడ్డి 86వేలకు, 10ఎకరాల 18గుంటలకు టి.సుధాకర్‌రెడ్డి 1.02లక్షలకు, 10ఎకరాలకు బి.యాదయ్య 54వేలకు, 12ఎకరాల 5గుంటలకు టి.రాం రెడ్డి 1.03లక్షలకు వేలం పాడారు. మొత్తం 53 ఎకరాల 21గుంటల భూమి మూడేళ్లకు కౌలు 4.85లక్షలు రానుందని ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. వేలంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, చేవెళ్ల కృష్ణయ్య, భరత్, నర్సింలు, జె.బాల్‌రాజ్, అశోక్, మాధవరెడ్డి, అమర్, సత్యనారాయణ, వేణుగోపాల్, లింగం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా

కొత్తూర్, జూన్ 15: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు తాను ముందుంటానని స్థానిక ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కొడిచర్ల పాఠశాలలో 5లక్షల రుపాయల ఎంపీపీ నిధులతో పూర్తి చేసిన ప్రహరీగోడను శనివారం ఎంపీపీ ప్రారంభించారు. అలాగే కొడిచర్ల, కొడిచర్లతండా, కాజిగూడ తండా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు తన నిధులతో పరిష్కారించడం జరిగిందన్నారు. ముఖ్యంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు పరిష్కరించానన్నారు. బడిఈడు పిల్లలను నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ హేమంత్, నాయకులు సీతారాంనాయక్, సంతోష్‌నాయక్, రవినాయక్, కిషన్, నర్సింహారెడ్డి, దర్శన్, టీచర్లు పాల్గొన్నారు.



పాఠశాల ప్రహరీని ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

ఉప ముఖ్యమంత్రికి నేతల శుభాకాంక్షలు



విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 15: ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. విక్రమార్క జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను శనివారం సచివాలయంలో కలిసి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్నిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ ఉన్నారు.

రంగారెడ్డి అర్బన్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచి కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం కేక్ కట్‌చేశారు. నాయకులు ఆయనకు గజమాల వేసి, శాలువాలతో సన్మానించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచుకున్నారు.

కందుకూరు: ఉపముఖ్యమంత్రి విక్రమార్కకు జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ కాంగ్రెస్ ప్రచార కమిటీ మెంబర్ ఏనుగు జంగారెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

తలకొండపల్లి, జూన్ 15 : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను తలకొండపల్లిలో శనివారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. రాష్ట్రానికి విక్రమార్క అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, రాష్ట్ర కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ మీడియా ఇన్‌చార్జి అజీమ్, నాయకులు ఆరీఫ్, రమేశ్, నర్సింహ, యాదగిరి, శ్రీను, రఘు, మైసయ్య, శేఖర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎం.రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 15:ఇళ్లులేని పేదలు ఇళ్లు కట్టుకోవడానికి త్వరలోనే నియోజకవర్గంలో ఇందిరమ్మ పథకం కింద మూడున్నర వేల ఇళ్లు మంజూరు చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం 92 మందికి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరిట పేదలను మోసం చేసిందన్నారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ధరణి పెండింగ్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే అర్హులకు రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతీ బుధవారం క్యాంప్ కార్యాలయంలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలపై నేరుగా చెప్పుకోవచ్చని చెప్పారు. మరో పదేళ్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతారెడ్డి, జెడ్పీటీసీ బి.మహిపాల్, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్లు నిరంజన్‌రెడ్డి, కప్పరి స్రవంతి, వైస్‌చైర్మన్ బర్ల మంగ, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో ఈ-సెంటర్ ప్రారంభం

ఆమనగల్లు, జూన్ 15 : ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా పాలన ఈ-సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం కేంద్రంలో గృహజ్యోతి, మహాలక్ష్మి, గ్యాస్ సిలిండర్ల సబ్సిడీకి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఆయా పథకాలు అందని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వసంత సూచించారు. ఈ అవకాశాన్నిన మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఈ-సెంటర్‌లో దరఖాస్తులు నమోదు చేస్తున్న సిబ్బంది

ఎన్కేపల్లిలో నీటి ఎద్దడి



ఎన్కేపల్లిలో నీటి కోసం ఇబ్బంది పడుతున్న మహిళలు

మొయినాబాద్ రూరల్, జూన్ 15: మండల పరిధి ఎన్కేపల్లి 7వ వార్డులో నీటిఎద్దడి నెలకొంది. సమస్యపై పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులంటున్నారు7వ వార్డు కాలనీలో ట్యాంక్ నల్లా నీరు సరిగ్గా అందడం లేదని స్థానికులు శనివారం తెలిపారు. ట్యాంక్ వద్ద వాల్వ్ ఇప్పగానే నీరంతా దిగువన ఉన్నవారికే వెళ్తోం దని, ఎగువనున్న ఇళ్లలోకి రావడం లేదని చెప్పారు. మధ్యంలో మరో కంట్రోల్ వాల్వ్ ఏర్పాటు చేయాలని కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య తీర్చాలని కోరారు.

జూలై చివరి నాటికి డీ-82 కాల్వ పనుల పూర్తి



అసంపూర్తి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూన్ 15: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 కాల్వ అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. అలసత్వానికి తావుండకూడదని సూచించా రు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాల పరిధిలో కేఎల్ఐ డి-82 అసంపూర్తి పనులను శనివారం ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ ఎ.ఎస్.ఎన్.రెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈఈ దేవానంద్‌లతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కల్వర్టులు, కొన్ని చోట్ల నిర్మించాల్సిన కాల్వ పనులను చూసి సూచనలు చేశారు. జూలై చివరి వరకు పెండింగ్ పనులన్నీ పూర్తిచేసి ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాల్లో 35వేల ఎకరాలకు నీరందిస్తామని నారాయణరెడ్డి పేర్కొన్నారు. కేఎల్ఐ డి-82 నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఐదు శాతం పెండింగ్ పనులు ఐదేళ్లలో నోచుకోకవడంతో విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, సాగునీటి కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ద్వారా నియోజకవర్గంలోని భూములకు సాగునీరందిస్తామన్నారు. ఆగస్టు 15నాటికి ప్రభుత్వం రైతలుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ అనితవిజయ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, నాయకులు బ్యంగి ఆనంద్ కుమార్, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి సన్మానం

కేశంపేట, జూన్ 15: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డిని శనివారం మండల బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. లింగంధనకు చెందిన ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ వి.లక్ష్మీనారాయణగౌడ్ నేతృత్వంలో నందిగామ మండలం మొదళ్లగూడానికి వెళ్లి ఎమ్మెల్సీ నివాసంలో పూలమాలలు,శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చిన్నరామస్వామి, భాస్కర్, తిరుపతిరెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, జంగయ్య, రాంరెడ్డి, రాజశేఖర్, భీమయ్య పాల్గొన్నారు.



నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీనారాయణగౌడ్

డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, జూన్ 15 : డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆమనగల్లు బ్రాంచ్ మేనేజర్ జగన్మోహన్, ఫీల్డ్ ఆఫీసర్ పండరినాథ్ కోరారు. రుణాల పంపిణీలో ఏపీజీవీబీ వ్యవసాయ రంగం, మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి సంకటోనిపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బీమా, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ సిబ్బంది ఎవరూ ఖాతాదారులకు ఫోన్‌చేసి పిన్, ఓటీపీ నంబర్లు అడుగరని, ఎవరైనా అడిగితే చెప్పొద్దన్నారు. ఏపీజీవీబీలో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు అతి తక్కువ ప్రీమియంతో బీమా చేసుకోవచ్చన్నారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, గ్రామ నాయకులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కందుకూరు: బ్లడ్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న చిన్నారి వేదవల్లిని ఆదుకోవాలంటూ'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అగర్‌మియాగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత ఇ.శ్రీకాంత్‌రెడ్డి స్పందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. శనివారం ఆ గ్రామ చెందిన యువజన సంఘం సభ్యులతో కలిసి వేదవల్లి తండ్రా రఘుకు రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వేదవల్లికి చికిత్స నిమిత్తం సీఎం ఎ.రేవంత్‌రెడ్డి స్పందించి 12న వేదవల్లి తండ్రికి రూ.5లక్షల ఎల్‌వోసీని మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో యువ జనసంఘం నాయకులు ఎ.నరేందర్‌రెడ్డి, కె.అనిల్‌రెడ్డి, ఎ.వెంకటేష్, జి.కిరణ్ కుమార్‌రెడ్డి, ఇ.దిలీప్‌రెడ్డి, ఇ.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎల్.శ్రీధర్‌రెడ్డి, డిల్లీ దేవేందర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

● **మహేశ్వరం:** చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని యశ్వ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పల్నాటి నరేష్ అన్నారు. నాగారం లో పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సాయం అంద జేసి మాట్లాడుతూ.. రోజూ గ్రామాల్లో మురుగు తొలగిస్తూ, బాధ్యతగా గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతపై చొరవ తీసుకుంటున్న కార్మికుల సేవ లు గొప్పవన్నారు. కార్మికులకు సహకారం అందించడంతో ఫౌండేషన్ ముందుంటుందన్నారు.

● **ఆమనగల్లు:** ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహి స్తే చర్యలు తప్పవని ఎంఈవో సర్దార్‌నాయక్ అన్నారు. సమయ పాలన పాటించాలని సూచించారు. కోనాపూర్ ప్రాథమికోన్నత, రాంనుంతల, పెద్దతండా, గేటు తండా ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో సందర్శించారు. కోనాపూర్‌లో విద్యార్థుల కు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చే శారు. రాంనుంతల పాఠశాలకు వెళ్లగా ఉదయం 9:40గంటల వరకు పాఠశాల తెరుచుకోకపోవడంతో టీచర్ బి.స్వాతికి మెమో జారీ చేశామని ఎంఈవో తెలిపారు. పెద్ద తండా పాఠశాలలో బోధనపై పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో జరిగిన బాలికల సాధికారిత కార్యక్రమంలో ఎంఈవో పాల్గొన్నారు.

● **ఆమనగల్లు:** మండల విద్యా శాఖ నోడల్ అధికారిగా ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు నియమితులయ్యారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో సర్దార్‌నాయక్‌తో కలిసి పాండుకు ఎంపీడీవో శ్రీకాంత్ నియామక పత్రాన్ని అందజేశారు. పాఠశాలలపై సరైన పర్యవేక్షణ చేసి ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా, ప్రభుత్వాల లక్ష్యాల పూర్తికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సీఆర్‌పీ లు ఉన్నారు.

క్రైం కార్నర్

కదులుతున్నరైలు దిగుతూ మహిళ మృతి



మృతి చెందిన మహిళ

శంకర్‌పల్లి, జూన్ 15 : కదులుతున్న రైలు దిగబోతూ పడి ఓ గుర్తు తెలియని మహిళ(44) మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ నుంచి గుంటూరు వెళ్లే పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలు శంకర్‌పల్లి స్టేషన్‌కు శనివారం మధ్యాహ్నం 2:14కు చేరింది. రైలు ఆగకముందే ఓ మహిళ దిగబోతూ రైలు కింద పడింది. చెయ్యి, మెడకు తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయింది. రైల్వే అధికారులు రైలును కొద్దిసేపు ఆపి, వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు చేరుకుని మృతురాలి వివరా లు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఆమె వద్ద టికెట్ లేకపోగా, ఆచూకీకి సంబంధించి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్సై శంకరయ్య తెలిపారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● డబ్బు ఇవ్వలేదనే మేనమామను చంపిన వ్యక్తి ● ఇద్దరి రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చేవెళ్ల, జూన్ 15: డబ్బులివ్వలేదన్న కక్షతో మేనమామను అల్లుడు హత్య చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో హతుడి మేనల్లుడు, అతడి సేహ్నితుడు పట్టుపడగా మరొకరి కోసం గాలిస్తున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి చెప్పారు. శనివారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లకు సీఐ వివరాలు వెల్లడించారు. తంగడ్‌పల్లికి చెందిన ఖాజాపాషా తనకు కొంత భూమి ఇవ్వాలని అతడి ఇద్దరు మేనమామలను అడిగాడు. దీనిపై కొద్ది నెలల క్రితం గ్రామంలో పంచాయితీ పెట్టారు. పెద్దమామ అన్వర్ ఖాన్ తన వంతుగా ఖాజాపాషాకు భూమికి బదులు రూ.14లక్షల ఇస్తానని ఒప్పుకున్నాడు. అయితే చిన్నమామ రుల్లాఖాన్ తన వంతు ఎంతో కొంత ఇస్తానన్నాడు. ఆ తర్వాత ఖాజా మూడు సార్లు రుల్లాఖాన్ వద్దకు వెళ్లి డబ్బులైనా, పొలమైనా ఇవ్వాలని గొడవపడ్డాడు. పొలం ఇవ్వను కానీ రూ.2లక్షలు ఇస్తానని ఒప్పుకున్నాడు. తనకు ఎక్కువ డబ్బు కావాలని ఖాజా గొడవపెట్టుకోగా అందుకు రుల్లాఖాన్ ఒప్పుకోలేదు. దీంతో రుల్లాఖాన్‌పై ఖాజా పగపెంచుకొని హత్యకు కుట్రపన్నాడు. గ్రామంలో మామ ఒంటరిగా ఉంటున్న విషయం తెలుసుకున్న ఖాజా.. హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితులు షేక్ ముస్తఫా, అఫ్సర్‌ల సహకారం తీసుకున్నాడు. గురువారం రాత్రి ముగ్గురు మద్యం తాగి స్కూటీపై తంగడ్‌పల్లిలోని రుల్లాఖాన్ ఇంటికి చేరుకున్నారు. అదే రాత్రి ఖాజాపాషా భూమి గురించి అడితే పొద్దున మాట్లాడుదాం అని మామ నిద్రపోయాడు. అర్ధ రాత్రి 2గంటల సమయంలో నిద్రిస్తున్న మామను ఖాజాపాషా కత్తితో కడుపులో పొడిచాడు. రుల్లాఖాన్ అరవగా ముస్తఫా నోరు మూశాడు. ఖాజాపాషా మామను విచక్షణారహితంగా పొడిచి చంపి పారిపోయారని విచారణలో తేలిందని సీఐ వివరించారు. రుల్లాఖాన్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయగా ముగ్గురు నిందితుల్లో ఖాజాపాషా, ముస్తఫా పట్టుపడగా అఫ్సర్ పరారీలో ఉన్నాడన్నారు. సమావేశంలో ఎస్సై ప్రదీప్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇద్దరు నిందితుల రిమాండ్

శంకర్‌పల్లి, జూన్ 15 : పందెం కాసి వ్యక్తి మృతికి కారకులైన ఇద్దరిని పోలీసులు శనివారం అరెస్టు చేసి చెవేళ్ల మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. చందిప్పకు చెందిన వడ్డె సురేష్‌తో అదే గ్రామానికి చెందిన మల్లేశం, మాణిక్యం పురుగుల మందు తాగితే రూ.1లక్ష ఇస్తామని పందెం కాశారు. దీంతో లక్ష రూపాయలు వస్తాయని సురేష్ పురుగుమందు తాగాడు. అతడు తీవ్ర అస్వస్థకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందగా కేసు నమోదు చేశారు.